www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 2 సంచిక -268 శుక్రవారం 13 డిసెంబర్ 2024 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



2లో.

## పిన్నవయస్సులో ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా గుకేశ్

చైనాకు చెందిన లిరెన్‌ను ఓడించి ఘనత సాధించిన గుకేశ్

18 ఏళ్లకే ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన భారతీయుడు

ఈ క్షణం కోసం పదేళ్లుగా ఎదురు చూస్తున్నానన్న గుకేశ్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు

## ధరణి పోర్టల్ సేవలు తాత్కాలికంగా నిలిపివేత

డేటాబేస్ వెర్షన్ అప్ గ్రేడ్ కారణంగా నిలుపుదల

డిసెంబర్ 16వరకు సేవలకు అంతరాయం



2లో.

## ట్రిపుల్‌ఆర్ ప్రాజెక్టుకు సాయం చేయండి..

### కేంద్రానికి సీఎంరేవంత్ రెడ్డి రిక్వెస్ట్ !

రేడియల్ రోడ్లు, మెట్రో ఫేజ్ 2, మూసీ రివర్ ఫ్రంట్‌లకు నిధులు ఇప్పించండి..

మూసీ గోదావరి లింక్.. హైదరాబాద్ సీవరేజీ మాస్టర్ ప్లాన్, వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్లాన్‌కు చేయూతనివ్వండి.. సింగరేణికి కోల్ బ్లాక్‌లు కేటాయించండి..



**న్యూ ఢిల్లీ డిసెంబర్ 12**,ప్రజావినికిడి: తెలంగాణ రాష్ట్రంలో వివిధ రకాల అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇచ్చేందుకు కృషి చేయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రాంతీయ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్), హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 తోపాటు హైదరాబాద్, వరంగల్‌ల్లో సీవరేజీ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్లాన్%ౌ% సింగరేణి సంస్థకు బొగ్గు గనుల కేటాయింపు సహా పలు అంశాలపై కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి చర్చించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం కలిశారు. ఈ సందర్భంగా మొత్త రూ. 1,63,559.31 కోట్ల విలువైన ప్రాజెక్టుల విషయంలో కేంద్రం నుంచి కావల్సిన చేయూతపై కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి చర్చించారు.

మిగతా 2లో...

# జమిలికి ఆమోదం





## 'వన్ నేషన్ - వన్ ఎలెక్షన్'కు కేంద్ర కేబినెట్ ఆమోదం

- మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం
- ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టే అవకాశం



**న్యూ ఢిల్లీ డిసెంబర్ 12**,,ప్రజావినికిడి: జమిలి ఎన్నికల(వన్ నేషన్ - వన్ ఎలెక్షన్)కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జమిలికి ఆమోదముద్ర వేసింది. ఈ పార్లమెంటు సమావేశాల్లోనే దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. దేశంలో వేర్వేరుగా ఎన్నికలు జరుగుతుండటం... దేశ ప్రగతికి ఆటంకంగా పరిణమిస్తోందని ఎన్డీయే ప్రభుత్వం తొలి నుంచి వాదిస్తున్న సంగతి తెలిసిందే. జమిలి ఎన్నికలకు సంబంధించి మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నేతృత్వంలో అత్యున్నత స్థాయి కమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 18,626 పేజీల నివేదికను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అందజేసింది.

మిగతా 2లో

## ఏడాది పాలనలో గురుకులాలు, హాస్టళ్లు ఆగమాగం : హరీశ్ రావు



సిద్దిపేటడిసెంబర్ 12,,ప్రజావినికిడి: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రశాంత్ నగర్ ఇంటిగ్రేటెడ్ ప్రభుత్వ హాస్టల్‌లో గురువారం సాయంత్రం మాజీ మంత్రి హరీశ్ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేసిన హరీశ్ రావు%ౌ% వసతి గృహంలో నెలకొన్న సమస్యల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ..

రేవంత్ రెడ్డి ఏడాది పాలనతో గురుకులాలు, హాస్టళ్లు అన్నీ ఆగమైపోయిన పరిస్థితి నెలకొందని అన్నారు. రేవంత్‌రెడ్డి హయాంలో వేలాది మంది విద్యార్థులు ఆసుపత్రుల పాలయ్యారని%ౌ% 49 మంది విద్యార్థులను ప్రభుత్వం పొట్టన పెట్టుకుందని ఆరోపించారు."3 లక్షల కోట్ల బడ్జెట్ ఉన్నటువంటి రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ,బీసీ పిల్లలకు కడుపునిండా అన్నం పెట్టే పరిస్థితుల్లో ప్రభుత్వం లేదు. కెసిఆర్ 1000కి పైగా గురుకులాలు స్థాపించి గురుకులాల గౌరవాన్ని ఎవరెస్టు శిఖరం అంత ఎత్తులో పెట్టారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ళకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నామని చెప్పారు.

మిగతా 2లో.

# ఈ నెలాఖరులోగా మంత్రివర్గ విస్తరణ

### : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రతిపక్ష నేతగా కేసీఆర్ సభకు వస్తారని భావిస్తున్నానన్న మంత్రి

రైతుకు బేడీలు వేసి తీసుకువెళ్లడం సరికాదన్న మంత్రి

అదానీ విషయంలో ఇక వివాదం వద్దని విజ్ఞప్తి



హైదరాబాద్,డిసెంబర్ 12,,ప్రజావినికిడి: ఈ నెల 31వ తేదీలోగా మంత్రివర్గ విస్తరణ ఉండొచ్చని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈరోజు ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ... ప్రతిపక్ష నేతగా కేసీఆర్ సభకు వస్తారని భావిస్తున్నానన్నారు. 80 వేల పుస్తకాలు చదివిన నేతగా సభకు వచ్చి సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు మిగతా 2లో...

## పొరపాట్లకు తావులేకుండా సర్వే

ఈనెల 31లోగా దరఖాస్తుల పరిశీలన పూర్తి

ఈఏడాది 4.5 లక్షల ఇండ్లను నిర్మించబోతున్నాం


సర్వేలో ఇందిరమ్మ కమిటీ సభ్యులను కూడా భాగస్వామ్యం

కలెక్టర్లతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్

మంత్రి పొంగులేటి కీలక ఆదేశాలు జారీ

ఇందిరమ్మ ఇండ్లపై ప్రభుత్వం వేగంగా అడుగులు

దరఖాస్తుల పరిశీలనకు డెడ్‌లైన్ విధింపు





హైదరాబాద్,డిసెంబర్ 12,,ప్రజావినికిడి: ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. కలెక్టర్‌ల వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి కీలక ఆదేశాలు జారీ చేశారు. దరఖాస్తుల పరిశీలనకు డెడ్‌లైన్ విధించిన మంత్రి.. పొరపాట్లకు తావులేకుండా సర్వే నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి దరఖాస్తుల పరిశీలనను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన, సామాజిక సర్వే తదితర అంశాలపై సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు మంత్రి. ఈకార్యక్రమంలో సీఎం సలహాదారు, సీఎస్ పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజా పాలనలో వచ్చిన 80 లక్షల దరఖాస్తుల పరిశీలనను ఈనెల 31 లోగా పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. పరిశీలన చేసిన సర్వే వివరాలను మొబైల్ యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. దీనికి సంబంధించి ప్రతి 500 మందికి ఒక సర్వేయర్‌ను నియమించుకోవాలన్నారు.

## బేడీలతోనే లగచర్ల రైతు ఆస్పత్రికి తరలింపు

తెలంగాణ పోలీసులు మరో దారుణం

ఆగ్రహం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ పార్టీ

ఘటనపై పోలీసులపై ముఖ్యమంత్రి ఆగ్రహం

ప్రజా ప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించదని హెచ్చరిక



2లో.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# జమిలికి ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

జమిలి ఎన్నికల బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం ముద్ర వేసింది.. ఈ మేరకు గురువారం మోదీ నేతృత్వంలో జరిగిన కేబినెట్ భేటీలో గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనిపై పార్లమెంట్ ముందుకు చర్చకు రానుంది. దేశంలో వేరువేరుగా ఎన్నికల నిర్వహణ.. దేశ ప్రగతికి ఆటంకంగా పరిణమిస్తోందంటూ కేంద్రంలోని బీజేపీ మొదటి నుంచి వాదిస్తోంది.కాగా, రాబోయే సాధారణ ఎన్నికలు.. జమిలిగానే జరపాలని ప్రధాని నరేంద్ర మోదీ కృత నిశ్చయంతో ఉన్నారు. అందుకోసం వ్యూహాత్మంగా అడుగులు వేస్తున్నారు. కానీ, పార్లమెంటులో రాజ్యాంగ సవరణలకు కూటమికి అవసరమైన సంఖ్యా బలం లేదు. అయినా ఈ బిల్లు ఆమోదించుకునేందుకు ముందుకెళ్లాలని మోదీ భావిస్తున్నారు. ముందుగా పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెడతారు.కోవింద్ కమిటి సిపార్సులకు అనుగుణంగా..జమిలి ఎన్నికలపై గతంలోనే కోవింద్ కమిటి 18,626 పేజీల ఈ నివేదికను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించింది. 2023, సెప్టెంబర్ 2 ఈ నివేదిక రూపకల్పనకు శ్రీకారం చుట్టారు. పలువురు నిపుణుల సారధ్యంలో 191రోజుల కసరత్తు అనంతరం ఈ నివేదికను పూర్తిచేశారు. తొలి దశలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించాలని, తరువాతి 100 రోజుల్లో రెండో దశలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోవింద్ కమిటీ ఈ నివేదికలో సిఫారసు చేసింది.కోవింద్ కమిటీ తన నివేదికలో ఏకకాలంలో ఓటు వేయడం దేశప్రజల ఆకాంక్షలను సాకారం చేయడంలో సహాయ పడుతుందని పేర్కొంది. ఒకేసారి ఐక్యంగా ఓటు వేయడం అనేది అభివృద్ధి ప్రక్రియను, సామాజిక ఐక్యతను ప్రోత్సహిస్తుందని.. ప్రజాస్వామ్య పునాదిని మరింత బలోపేతం చేస్తుందని తెలిపింది. ఏకకాలంలో ఓటింగ్ జరగడం వల్ల పారదర్శకత, సౌలభ్యం, ఓటరు విశ్వాసం గణనీయంగా పెరుగుతుందని కోవింద్ కమిటీ భావించింది.ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడానికి అవసరమైన పరికరాలు, సిబ్బంది, భద్రతా దళాల ముందస్తు ప్రణాళికను ఈ కమిటీ సిఫారసు చేసింది. తొలిసారిగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీల పదవీకాలం వచ్చే లోక్‌సభ ఎన్నికల వరకు ఉండవచ్చని నివేదిక పేర్కొంది. హంగ్ హౌస్ లేదా అవిశ్వాస తీర్మానం జరిగితే, మిగిలిన ఐదేళ్ల కాలానికి తాజా ఎన్నికలు నిర్వహించవచ్చని కోవింద్ కమిటీ పేర్కొంది.

# ఈ నెలాఖరులోగా మంత్రివర్గ విస్తరణ ఉండొచ్చు

(మొదటి పేజీ తరువాయి)

మేడ్చల్, రంగారెడ్డి అక్రమార్కుల చిట్టాను త్వరలో విప్పుతామని హెచ్చరించారు.లగచర్ల కేసులో అరెస్టై జైల్లో ఉన్న రైతును ఆసుపత్రికి తీసుకెళ్లే సమయంలో బేడీలు వేయడం సరికాదని మంత్రి అభిప్రాయపడ్డారు. అదానీ విషయంలో ఇక వివాదం వద్దని... ఆయన ఇచ్చిన రూ.100 కోట్లను తమ ప్రభుత్వం వెనక్కి ఇచ్చిందని స్పష్టం చేశారు. హాస్టళ్లకు పెండింగ్ బిల్లులను ఈ నెల 31వ తేదీ లోగా విడుదల చేస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఉక్కు కర్మాగారం గురించి ఎందుకు మాట్లాడటం లేదో చెప్పాలన్నారు.అసెంబ్లీలో ప్రజలకు సంబంధించిన అంశాలు చర్చకు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి సభ్యుడు సభ విలువను కాపాడాలని, ప్రజాస్వామ్యయుతంగా చర్చకు రావాలన్నారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం వేదికగా రెండు రోజుల పాటు జరిగిన ప్రజాప్రతినిధుల శిక్షణా తరగతులు ముగిశాయి.అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ... ఈరోజుతో శిక్షణా తరగతులు ముగిశాయన్నారు. తెలంగాణ మూడో శాసన సభకు ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు శాసనసభా వ్యవహారాల శాఖ రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించిందన్నారు. శాసనసభ, మండలిలో సమర్థవంతంగా ప్రజల అంశాలు చర్చకు రావాలన్నారు.ప్రజల కోసం ఏం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు ఏర్పడ్డాయో అది నెరవేరే విధంగా సభ్యులంతా సభా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య విలువలకు శాసనసభ వేదిక అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

# జర్నలిస్ట్ రక్షణ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలి

- సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన టీఎస్ జేయు బృందం
- చిన్న పత్రికల ఎంపానెల్మెంట్ వెంటనే చెపట్టాలి
- జర్నలిస్ట్ పెన్షన్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి
- టీఎస్ జేయు డిమాండ్



హైదరాబాద్ బ్యూరో,
డిసెంబర్ 12,,ప్రజావినికిడి:

ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న పాత్రికేయుల కోసం మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలలో అమలు చేస్తున్నట్లుగా జర్నలిస్ట్ పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని గురువారం టీఎస్జేయు రాష్ట్ర కమిటీ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసింది. అదేవిధంగా 10 లక్షల రూపాయల ఉచిత జీవిత బీమా సదుపాయం కల్పించాలని, టీఎస్ జేయు నాయకత్వం మంత్రిని కోరింది. అక్రిడేషన్ల కమిటీలు పునరుద్ధరణ చేసి, జర్నలిస్ట్ లందరికీ అక్రిడేషన్లు ఇవ్వాలని కోరారు. అక్రిడేషన్లతో సంబంధం లేకుండా, జర్నలిస్ట్ సంక్షేమ పథకాలను జర్నలిస్టుల అందరికి అందేలా చూడాలని కమిటీ కోరింది. రాబోయే అక్రిడేషన్ కమిటీలలో అన్ని జర్నలిస్ట్ సంఘాలకు భాగస్వామ్యం ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగౌని, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రాజ్ పటేల్, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు క్రాంతి కుమార్, అశోక్ తదితరులు ఉన్నారు.

**ప్రధాన డిమాండ్లు:**

1. చిన్న పత్రికలను తక్షణమే ఎంపానెల్మెంట్ లు చేయాలి 2. సంక్షేమ పథకాలలో యూనియన్ల జోక్యం లేకుండా చూడాలి, జర్నలిస్టుల సంక్షేమ పథకాలు నేరుగా అమలు చేయాలని, యూనియన్ల జోక్యం లేకుండా వ్యవస్థను మెరుగుపరచాలి.

3. మీడియా రంగానికి ప్రత్యేక పాలసీ రూపొందించి, జర్నలిస్టుల భద్రత, పత్రికా స్వేచ్ఛకు పూర్తి రక్షణ కల్పించాలి. 4. మీడియా ఉద్యోగుల సంక్షేమం జర్నలిస్టుల ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన బీమా, పెన్షన్, ఇతర ఆర్థిక సహాయ కార్యక్రమాలను విస్తరించాలి.

# బేడీలతోనే లగచర్ల రైతు ఆస్పత్రికి తరలింపు

**తెలంగాణ పోలీసులు మరో దారుణం**
**ఆగ్రహం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ పార్టీ**
**ఘటనపై పోలీసులపై ముఖ్యమంత్రి ఆగ్రహం**
**ప్రజా ప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించదని హెచ్చరిక**



హైదరాబాద్,డిసెంబర్ 12,, ప్రజావినికిడి: తెలంగాణలో లగచర్ల రైతుల పోరాటం తీవ్ర రాజకీయ పరిణామాలకు దారి తీసిన విషయం తెలిసిందే. అయితే అధికారులపై దాడికి పాల్పడ్డారనే ఆరోపణలతో ఆ గ్రామ రైతులను అరెస్ట్ చేసి జైలులో ఉంచిన విషయం తెలిసిందే. వారికి సంబంధించి కేసు విచారణలో ఉంది. అయితే దాడి నెపంతో అమాయక రైతులపై పోలీసులు క్రూరంగా ప్రవర్తిస్తున్నారు. ఇప్పటికే లగచర్లలో బీభత్సం సృష్టించిన పోలీసులు తాజాగా మరో దారుణానికి పాల్పడ్డారు. అనారోగ్యానికి గురయిన లగచర్ల రైతును బేడీలతోనే ఆస్పత్రికి తరలించడం సంచలనంగా మారింది. పోలీసుల చర్య రాజకీయ దుమారం రేపింది. ఆ వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేయగా.. ప్రతిపక్షాలు మండిపడుతుండడంతో ముఖ్యమంత్రి స్పందించి సంబంధిత పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లాలోని రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో ఫార్మా విలేజ్ ఏర్పాటుపై తీవ్ర వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఆ సమయంలో రైతులు తీవ్రంగా వ్యతిరేకించిన సమయంలో అధికారులను ఘెరావ్ చేశారు. అధికారులపై దాడికి పాల్పడ్డారనే కారణంతో అమాయక రైతులను అరెస్ట్ చేశారు. కొందరు సంగారెడ్డి రెడ్డి జైలులో ఉండగా.. మరికొందరు ఇతర జైళ్లల్లో ఉన్నారు. తాజాగా అరెస్టయిన రైతుల్లో ఇద్దరు అనారోగ్యానికి గురయ్యారు. సంగారెడ్డి జైల్లో ఉన్న లగచర్ల రైతు హీర్యా నాయక్‌కు గుండె నొప్పి వస్తే ఆ సమాచారం బయటకు రాకుండానివ్వకుండా ఆస్పత్రికి తరలించారు. లగచర్ల రైతు హీర్యా నాయక్‌ను చికిత్స కోసం సంగారెడ్డి ఆసుపత్రికి బేడీలతో తీసుకెళ్లడంపై రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అధికారులను సీఎం ఆరా తీశారని సమాచారం. రైతుకు బేడీలు వేసి తీసుకెళ్లాల్సినంత అవసరం ఏమొచ్చిందని అధికారులను నిలదీసినట్లు తెలుస్తోంది. ఘటనపై విచారణ జరిపి పూర్తి నివేదిక సమర్పించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించదని హెచ్చరించారని సీఎంఓ వర్గాలు వెల్లడించాయి. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, హరీశ్ రావుతోపాటు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తదితరులు ఈ సంఘటనను ఖండించారు.

# ధరణి పోర్టల్ సేవలు తాత్కాలికంగా నిలిపివేత

హైదరాబాద్,డిసెంబర్ 12,,ప్రజావినికిడి:

ధరణి పోర్టల్ సేవలకు సంబంధించి తెలంగాణ సర్కార్ కీలక అప్డేట్ ఇచ్చింది. డిసెంబర్ 16వ తేదీ వరకు పోర్టల్ సేవలు తాత్కాలికంగా అందుబాటులో ఉండవని ఓ ప్రకటనలో పేర్కొంది. డేటాబేస్ వెర్షన్ అప్ గ్రేడ్ కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. 16వ తేదీ ఉదయం వరకు అప్ గ్రేడ్ ప్రక్రియ ముగిసే అవకాశం ఉంటుందని వివరించింది. ధరణి పోర్టల్ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఐసీకి అప్పగించిన సంగతి తెలిసిందే. ఇదే విషయంపై ఇటీవలే మీడియాతో మాట్లాడిన మంత్రి పొంగులేటి.. కీలక విషయాలను వెల్లడించారు. నిపుణుల కమిటీ రిపోర్టు ఆధారంగా ధరణి పోర్టల్ ను ఎలా ప్రక్షాళన చేయాలని చూస్తున్నామన్నారు. ప్రజలకు మంచి జరిగేలా ధరణి పోర్టల్ లో మార్పులు చేస్తామని చెప్పుకొచ్చారు. 2020 ఆర్వోఆర్ చట్టంలో లోపాలు సరిచేసి 2024 ఆర్వోఆర్ చట్టం తెస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని 9వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదిస్తామన్నారు. ధరణి కొత్త యాప్, కొత్త చట్టం సామాన్యులకు చాలా ఉపయోగపడుతుందని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రాత్రికి రాత్రే రద్దు చేసిందన్నారు. అయితే రెవెన్యూ గ్రామాలకు ఒక అధికారి ఉండాలనేది స్థానికులు అభిప్రాయం అన్నారు.భూముల నిర్వహణకు సంబంధించి తెలంగాణలో కొత్త చట్టం రాబోతుంది. ఇప్పటికే 'ది తెలంగాణ రికార్డ్ ఆఫ్ రైట్స్ బిల్-2024' ముసాయిదాను కూడా ప్రవేశపెట్టింది. ఈ బిల్లుపై ప్రజాభిప్రాయాలను సేకరించారు. ఇప్పుడు జరగబోయే%ొ%.అసెంబ్లీ సమావేశాల్లో ఆర్వోఆర్ బిల్లు ప్రవేశపెట్టి%ొ% ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. ఈ ముసాయిదా బిల్లు పేర్కొన్న వివరాల ప్రకారం%ొ%.. ప్రతి భూకమతానికి తాత్కాలిక, శాశ్వత భూదార్ (ప్రత్యేక గుర్తింపు సంఖ్య) ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుత రికార్డులను పరిశీలించి తాత్కాలిక సంఖ్య ఇస్తారు. సర్వే చేసిన తర్వాత శాశ్వత భూదార్ కేటాయిస్తారు. 2020లో తీసుకొచ్చిన ఆర్వోఆర్ చట్ట ప్రకారం%ొ% చాలా ఇబ్బందులు ఉన్నాయి. అప్పీల్, రివిజన్ వ్యవస్థలు లేకపోవటంతో భూ యజమానులకు అనేక సమస్యలు ఏర్పడ్డాయి. కలెక్టర్లకు ఎక్కువ అధికారాలు ఉండటంతో క్షేత్రస్థాయిలోని అధికారులు ఏం చేయలేని పరిస్థితి ఉండేది. అయితే కొత్త చట్టంలో మూడంచెల అప్పిలేట్ అథారిటీలను నియమించనున్నారు. తహసీల్దారు, ఆర్డీవోల మ్యుటేషన్లపై అభ్యంతరాలను స్వీకరించే అవకాశం ఉంది.ఆర్వోఆర్ రికార్డుల్లో తప్పులుంటే వాటిపై మొదటి అప్పీలుపై రివిజన్ అధికారాలు కలెక్టర్ లేదా అదనపు కలెక్టర్‌కు ఇవ్వనున్నారు, ఇక రెండో అప్పీలుపై సీసీఎల్ఏకు, మూడో అప్పీలుపై ప్రభుత్వానికి చేసుకునే వీలు ఉంటుంది. కొత్త చట్టం ద్వారా పహాణీలను కూడా అప్డేట్ చేస్తారు. ఇందుకు సంబంధించి డిసెంబర్ 16వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో పూర్తిస్థాయిలో క్లారిటీ రానుంది.

# పిన్నవయస్సులో ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా గుకేశ్

**న్యూ ఢిల్లీ** డిసెంబర్ 12,,ప్రజావినికిడి:

భారత యువ గ్రాండ్ మాస్టర్ గుకేశ్ ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా అవతరించాడు. చివరిదైన 14వ గేమ్‌లో చైనాకు చెందిన లిరెన్‌ను ఓడించిన గుకేశ్ ప్రపంచ ఛాంపియన్ షిప్ ను కైవసం చేసుకున్నాడు. అత్యంత చిన్న వయసులో 18 ఏళ్లకే గుకేశ్ ఈ ఘనత సాధించి చరిత్ర సృష్టించాడు. మొత్తం 14 గేమ్‌లలో గుకేశ్ 3, లిరెన్ 2 గేమ్‌లలో విజయం సాధించారు. తొమ్మిది గేమ్‌లు డ్రా అయ్యాయి. ఈ క్షణం కోసం తాను పదేళ్లుగా కలలు కన్నానని గుకేశ్ అన్నాడు. తన కల నెరవేరినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నాడు. ఈ విజయాన్ని తాను ఊహించలేదని, ఈ ఘనత సాధించగానే భావోద్వేగానికి లోనయ్యానన్నాడు. తన దృష్టిలో లిరెన్ నిజమైన ప్రపంచ ఛాంపియన్ అని పేర్కొన్నాడు. లిరెన్‌కు అతను ధన్యవాదాలు తెలిపాడు.18 ఏళ్ల వయస్సులోనే ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన గుకేశ్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారని తెలంగాణ సీఎంవో ఎక్స్ వేదికగా ట్వీట్ చేసింది. 18 ఏళ్ల వయస్సులో ఏం చేయాలని చాలామంది ఆలోచిస్తుంటారని, అలాంటి వయస్సులో గుకేశ్ రికార్డ్ సృష్టించారని కేటీఆర్ పేర్కొన్నారు.

అత్యంత పిన్న వయస్సులోనే ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా గుకేశ్ నిలిచారని, ఇది చారిత్రాత్మక, ఎంతోమందికి ప్రేరణను ఇచ్చే విజయమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ విజయం అతని అసమాన ప్రతిభకు, నిరంతర కృషికి, అచంచలమైన సంకల్పానికి నిదర్శనమన్నారు.

చెస్ రంగంలో గుకేశ్ తన విజయాన్ని సుస్థిరం చేసుకోవడంతో పాటు పెద్ద పెద్ద కలలు కనే యువతకు ప్రేరణగా నిలుస్తాడన్నారు. అంకితభావం, అభిరుచితో ఏదైనా సాధించవచ్చని గుకేశ్ తన విజయం ద్వారా వెల్లడించారన్నారు. గుకేశ్ ఇలాగే మరిన్ని విజయాలు సాధించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

**మరెన్నో విజయాలు సాధించాలి: కిషన్ రెడ్డి**

2024 ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచినందుకు గుకేశ్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. గుకేశ్ విజయంతో యావత్ దేశం గర్విస్తోందన్నారు. గుకేశ్ ఈ రంగంలో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

**ఔత్సాహిక ప్రతిభావంతులకు స్ఫూర్తి: బండి సంజయ్**

గుకేశ్ విజయం ఈ దేశానికి కూడా గొప్ప మైలురాయి అని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఔత్సాహిక ప్రతిభావంతులకు గుకేశ్ స్ఫూర్తిగా నిలిచారన్నారు.

**చిన్న వయస్సులో రికార్డ్ సృష్టించారు: కేటీఆర్**

మనలో చాలామంది 18 ఏళ్ల వయస్సులో ఏం చేయాలా? అని ఆలోచిస్తుంటారని, కానీ అదే వయస్సులో మీరు అద్భుతమైన ప్రపంచ రికార్డును సొంతం చేసుకున్నారంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. ప్రపంచ చెస్ ఛాంపియన్ గెలిచిన గుకేశ్‌కు అభినందనలు తెలిపారు. ఇది ఆయన కుటుంబానికే కాకుండా ఈ దేశానికే గర్వించదగ్గ క్షణాలు అన్నారు. గుకేశ్ ఎన్నో తరాలకు స్ఫూర్తిగా నిలుస్తారని పేర్కొన్నారు.

# ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టుకు సాయం చేయండి..

(మొదటి పేజీ తరువాయి)

ఆర్ఆర్ఆర్ నిర్మిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2022లోనే ప్రకటించిన విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం భూ సేకరణను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని.. త్రైపాక్షిక ఒప్పందం పూర్తయినా ఇప్పటి వరకు ఎన్‌హెచ్ఏఐ అనుమతి ఇవ్వలేదని తెలిపారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి ఇంకా అనుమతి ఇవ్వని విషయాన్ని కేంద్ర మంత్రికి సీఎం గుర్తు చేశారు. ఆర్ఆర్ఆర్‌తో పాటు రేడియల్ రోడ్లు పూర్తయితే ఫార్మా పరిశ్రమలతో పాటు ఇండస్ట్రియల్ హబ్ లు, లాజిస్టిక్ పార్క్‌లు, రిక్రియేషన్ పార్కులు వంటివి అభివృద్ధి అవుతాయని సీఎం అన్నారు.ఆర్ఆర్ఆర్ రెండు వైపులా పూర్తికి ఈ రహదారికి సంబంధించి వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అనుమతులన్నీ ఇప్పించేందుకు కృషి చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మొత్తం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.34,367.62 కోట్లు అని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు.ఓఆర్ఆర్- ఆర్ఆర్ఆర్‌ల అనుసంధానానికి రేడియల్ రోడ్లు నిర్మించాలని సంకల్పించామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 10 గ్రీన్‌ఫీల్డ్ రోడ్లతో పాటు ఓఆర్ఆర్ అనుసంధానించే మెట్రో కారిడార్ రేడియల్ రోడ్లకు రూ.45 వేల కోట్లు వ్యయమవుతాయని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు.మెట్రో ఫేజ్ 2లో భాగంగా నాగోల్ నుంచి రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, రాయదుర్గం నుంచి కోకాపేట్ నియోపోలిస్, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట, మియాపూర్-పటాన్ చెరు, ఎల్బీ నగర్-హయత్ నగర్ మధ్య మొత్తం 76.4 కి.మీల నిర్మించనున్న మెట్రో రైలు నిర్మాణానికి రూ.24,269 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేసినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 50: 50 వాటాతో మెట్రో ఫేజ్‌ను 2 చేపట్టేందుకు సహకరించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు.మూసీరివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ పరిధిలోని 222.27 ఎకరాల భూమి రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ఇప్పటికే కోరిన విషయాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఆ భూముల బదలాయింపుతో పాటు గాంధీ సరోవర్ నిర్మాణం, మూసీ సీవరేజీ ప్రాజెక్టులు, 11 హెరిటేజ్ వంతెనల నిర్మాణంతో పాటు ఇతర పనులకు రూ.14,100 కోట్లు వ్యయమవుతాయని అంచనా వేశామని, నిధుల మంజూరుతో పాటు అనుమతులకు సహకరించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
శుక్రవారం 13 డిసెంబర్ 2024

# రైతుకు బేడీలు వేయడం అమానవీయం

**రేవంత్ క్రూర మనసత్వానికి నిదర్శనం లగచర్ల రైతులకు అండగా ఉంటాం**

**గవర్నర్ కూడా అంశంపై విచారణకు ఆదేశించాలి**

**బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



హైదరాబాద్‌డిసెంబర్ 12,,ప్రజావినికిడి: గుండెపోటుకు గురయిన లగచర్ల గిరిజన రైతు హీర్యా నాయక్‌కు బేడీలు వేయడం అమానవీయం, రేవంత్ క్రూర మనసత్వానికి నిదర్శనమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. జైలులో ఉన్న రైతు బిడ్డ హీర్యా నాయక్‌కు నిన్న గుండెల్లో నొప్పి వస్తే.. వైద్య సహాయం అందించడంలో ప్రభుత్వం అలసత్వం చూపిందని మండిపడ్డారు. ఈ వ్యవహారాన్ని కుటుంబసభ్యులకు చెప్పకుండా, బయటకు చెప్పకుండా దాచిపెట్టే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. ఆస్పత్రికి తరలించకుండా.. చికిత్స అందించకుండా అమానవీయంగా వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జైలులో ఉన్న లగచర్ల రైతు హీర్యా నాయక్ గుండెపోటుకు గురవగా అతడిని బేడీలతోనే ఆస్పత్రికి తరలించడం తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ అంశాన్ని ఖండిస్తూ హైదరాబాద్‌లోని నంది నగర్‌లో ఉన్న తన నివాసంలో కేటీఆర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. రేవంత్ రెడ్డి రైతులను మోసం చేస్తోందని.. బేడీలు వేసి అవమానించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా లగచర్ల రైతులకు తాము అండగా ఉంటామని ప్రకటించారు. 'హీర్యా నాయక్‌తోపాటు లగచర్ల రైతులు రాఘవేంద్ర, బసప్ప ఆరోగ్యం బాగాలేదని.. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి అనేక ఆరోగ్య సమస్యలు ఉన్నాయి' అని కేటీఆర్ వివరించారు. రైతుబిడ్డకు బేడీలు వేసి అన్యాయంగా.. అమానవీయంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆసుపత్రికి తీసుకువచ్చింది. స్ట్రెచర్‌పై.. అంబులెన్స్‌లో తీసుకురావాల్సిన మనిషిని బేడీలు వేసి తీసుకువచ్చారు. ఇంతటి దుర్మార్గమైన అమానవీయమైన ప్రవర్తన క్షమార్హం కాదు' అని మాజీ మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. 'ఇలా చేయడం రాజ్యాంగంలోని 14, 16, 19 ఆర్టికల్స్ ప్రకారం వారి హక్కులను హరించడమే. కొత్త క్రిమినల్ చట్టం బీఎన్ఎస్ఎస్ ప్రకారం కూడా.. పోలీస్ మాన్యువల్స్, జైల్ మాన్యువల్స్ ప్రకారం అండర్ ట్రావెల్స్ ఖైదీల హక్కులను హరించడమే' అని మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. 'హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించాలి. గవర్నర్ కూడా ఈ అంశంపై విచారణకు ఆదేశించాలి' అని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. 'రైతులను వేధిస్తుంటే రేవంత్ రెడ్డి మాత్రం జైపూర్‌లో విందులు.. వినోదాలలో జల్సాలు చేసుకుంటూ చిందులు వేస్తున్నారు. కానీ తెలంగాణ గిరిజన రైతులు మాత్రం జైళ్లలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు' అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీకి హృదయం ఉంటే గిరిజనుల పట్ల ప్రేమ ఉంటే వెంటనే కేసులు రద్దు చేయాలని రేవంత్ రెడ్డికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. 'మేము చెప్పిందే నడవాలని అహంకారంతో రేవంత్ రెడ్డి ఆయన సోదరులు గిరిజన రైతన్నల ప్రాణాలు తీస్తున్నారు' అని ఆరోపించారు. 'నా మాట వినలేదు అనే ఏకైక కారణంతోనే లగచర్ల రైతులపై రేవంత్ రెడ్డి దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు' ని తెలిపారు. బేషజాలకు పోకుండా గిరిజన రైతులపై అక్రమ కేసులను వెనక్కి తీసుకొని జైలు నుంచి విడిపించాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. 'రేవంత్ రెడ్డి మాత్రం కక్షపూరితంగా రైతులపై కేసులు పెట్టించారు. ఆయన అహంకారం దెబ్బతిన్నదని, ప్రతిష్టకు తీసుకొని అదే రోజు 17 మంది రైతన్నలను అరెస్ట్ చేయించారు' అని గుర్తుచేశారు. అదుపులోకి తీసుకున్న రైతులపై పోలీసులు థర్డ్ డిగ్రీ టార్చర్ చేశారని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు.

## ఛతీస్‌ఘఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

### 12మంది మావోయిస్టులు మృతి

బస్తర్,డిసెంబర్ 12,,ప్రజావినికిడి: ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య భీకర ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు మృతిచెందారు. దంతేవాడ, నారాయణపూర్ సరిహద్దుల్లోని దక్షిణ అబూజ్‌మడ్ అడవుల్లో భద్రతా సిబ్బంది మావోయిస్టుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులకు ఎదురుపడిన మావోయిస్టులు కాల్పులకు పాల్పడ్డారు. ప్రతిగా భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో మావోయిస్టులు మరణించారు. గురువారం ఉదయం 3 గంటల నుంచి ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయని బస్తర్ పోలీసులు వెల్లడించారు. కూంబింగ్‌లో నారాయణపూర్, దంతెవాడ, జగదల్‌పూర్, కొండగాల్ జిల్లా భద్రతా బలగాలతోపాటు డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, సీఆర్‌పీఎఫ్ బలగాలు పాల్గొన్నాయి. కాగా, నవంబర్ 30న ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చెల్పాక-ఐలాపూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ జరిగిన విషయం తెలిసిందే. మావోయిస్టులు, పోలీసులకు మధ్య భీకరపోరులో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఇందులో ఒకరు మహిళా మావోయిస్టు ఉన్నారు. రెండు ఏకే 47 తుపాకులతోపాటు మరో ఐదు ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో ఆరుగురు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు కాగా, తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామానికి చెందిన ఏగోలపు మల్లయ్య ఉన్నారు.

## విద్యాలయాల వసతుల కల్పనలో కాంగ్రెస్ విఫలం

### చలికివణుకుతున్న విద్యార్థులు : ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్‌డిసెంబర్ 12,,ప్రజావినికిడి: రాష్ట్రంలో గురుకులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితిలో లేదని, దీంతో విద్యార్థులు చలికి వణుకుతున్నారని బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాలయాల్లో వసతులు కల్పించడంలో రేవంత్ సర్కార్ విఫలమైందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. కష్టాల కడలిలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయలు కొట్టుమిట్టాడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లాలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులు దుప్పట్లు లేక చలికి వణికిపోతూ నేలపైనే నిద్రిస్తున్నారని, చన్నీటితో స్నానం చేస్తున్నారన్నారు. ఇది ప్రభుత్వ చేతగానితనానికి, అసమర్థతకు నిదర్శనమని మండిపడ్డారు. కేవలం జగిత్యాల జిల్లాలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఇదే రకమైన పరిస్థితులు ఉన్నాయని చెప్పడంలో సందేహం లేదన్నారు. ఆడబిడ్డలు చదువుతున్న పాఠశాల్లో అన్ని వసతులు కల్పించాలని, తగిన విధంగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం సారంగాపూర్ కస్తూర్బా విద్యాలయంలో తొమ్మిది మంది విద్యార్థినులు అస్వస్థత చెందగా, అందులో ముగ్గురిని స్థానిక దవాఖానకు, మరో ఆరుగురిని జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స అనంతరం కోలుకోవడంతో సాయంత్రం ఇండ్లకు పంపించిన విషయం తెలిసిందే. మంగళవారం వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన బాలికల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ జరిగింది. దీంతో 15 మంది విద్యార్థినులు దవాఖానలో చేరారు.

## ఏడాది పాలనలో గురుకులాలు, హాస్టళ్ళు ఆగమాగం

### : హరీశ్ రావు



ఈ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ కు జూన్ నుండి నవంబర్ వరకు ఆరు నెలలుగా మెస్ చార్జీల చెల్లింపులు జరగలేదు. దాదాపు తొమ్మిది లక్షల 50 వేల రూపాయలు బిల్లులు పెండింగులో ఉన్నాయి.హాస్టల్ వార్డెన్లు బంగారం కుదవబెట్టి అప్పులు తెచ్చి విద్యార్థులు ఆకలి తీరుస్తున్నారు. మెస్ చార్జీలు సకాలంలో చెల్లించకపోతే విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఎలా పెడతారు?. విద్యార్థులు ఆసుపత్రి పాలైతే ఉపాధ్యాయులను, వార్డెన్లను సస్పెండ్ చేస్తా అంటున్నావ్. శిక్ష రేవంత్ రెడ్డికి వెయ్యాలి. మెస్సు బిల్లులు చెల్లించండి. మెసేజ్ చార్జీలు పెండింగ్ లో పెట్టింది రేవంత్ రెడ్డి, కాబట్టి శిక్ష ముఖ్యమంత్రికి వేయాలి.రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతాయి చేతలు గడప కూడా దాటవు. రాష్ట్రమంతా ఇదే పరిస్థితి ఉందేమో. గత సంవత్సరం విద్యార్థులకు ప్లేటు, గ్లాసు, స్పూన్, టవల్స్, స్కూల్ యూనిఫార్మ్ అన్ని సకాలంలో అందాయి. ఈ సంవత్సరం ఇవేవీ ఇవ్వలేదు అని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రేవంత్ రెడ్డి రాజీవ్ గాంధీ పుట్టిన రోజుకు ఫుల్ పేజీ పేపర్ యాడ్ ఇస్తున్నారు. తొమ్మిది రోజుల విజయోత్సవాలు జరుపుకున్నారు. కానీ ఈ పిల్లలకు బుక్కెడు అన్నం పెట్టే చాతకాదా? విద్యార్థులను అర్ధాకలితో ఉంచినందుకు ఏడాది విజయోత్సవాలు చేసుకుంటున్నావా?ఆడపిల్లల హాస్టల్లలో చలికాలం వేడి నీళ్లు రాక ఇబ్బంది పడుతున్నారు. ఎస్సీ గురుకుల పాఠశాలల్లో అక్టోబర్, నవంబర్ మెస్ బిల్లులు పెండింగ్ ఉన్నాయి. పార్ట్ టైం ఉద్యోగులకు 8 నెలలుగా జీతాలు ప్రభుత్వం ఇవ్వడం లేదు. 8 నెలల నుండి జీతాలు చెల్లించకపోతే వారు ఎలా పని చేస్తారు? వాళ్ళ కుటుంబాన్ని ఎలా పోషిస్తారు.?

ఎస్సీ గురుకుల పాఠశాలల్లో ఆరు నెలలుగా కాస్మెటిక్ చార్జీలు పెండింగ్ లో ఉన్నాయి. ఇదీ రేవంత్ రెడ్డి ఏడాది పాలన! కోతలు ఎక్కువ చేతలు తక్కువ. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి గారు సత్యవతి రాథోడ్ గారు.. వికారాబాద్ జిల్లా తాండూరులో ఫుడ్ పాయిజన్ వల్ల బాలికలు ఆసుపత్రిలో పాలైతే వారిని పరామర్శించేందుకు వెళ్తుండగా ప్రభుత్వం అడ్డుకోవడం దుర్మార్గం.ప్రభుత్వం సక్రమంగా హాస్టళ్ళు నడుపుతున్న మాట నిజమైతే మాజీ మంత్రులు పోతుంటే ఎందుకు అడ్డుకున్నావు రేవంత్ రెడ్డి?మీ తప్పులు, మీ లోపాలు బయటపడతాయని సబితని అడ్డుకున్నారు. అరెస్టులు కాదు చేయాల్సింది, పిల్లలకు కడుపునిండా అన్నం పెట్టు. సంవత్సర కాలం నుంచి హాస్టల్ భవనాలకు అద్దెలు చెల్లించడం లేదు. వెంటనే హాస్టల్ రెంట్లను చెల్లించాలి.ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖలను నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి పూర్తిగా విఫలమయ్యారు. ముఖ్యమంత్రి ఏనాడైనా ఒక ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ కు వెళ్లి విద్యార్థుతో భోజనం చేసావా?. ఒకనాడైనా విద్యార్థులను పరామర్శించావా? అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలను విస్మరిస్తున్నాడు రేవంత్ రెడ్డి.రేవంత్ రెడ్డి ప్రాధాన్యతలు వేరు. ఫోర్త్ సిటీ కడతా ఆరు లైన్ల రోడ్డు మీ భూముల దాకా వేసుకుంటా.. ఇవి నీ ప్రాధాన్యతలు.కోట్ల రూపాయల డబ్బు ఉత్సవాల పేరుతో వృథా చేశారు. పిల్లలు భోజనం చేసే అన్నం చూస్తే ఆవేదన కలిగింది. మీరు దొడ్డు బియ్యంతో అన్నం పెడుతుంటే ముద్దలాగ అయిన అన్నాన్ని విద్యార్థులు తినలేక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తక్షణమే ప్రభుత్వం హాస్టల్ మెస్ బిల్లులన్నీ విడుదల చేయాలి. ఆరు నెలలుగా సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ హాస్టల్ కి బిల్లులు విడుదల చేయలేదు. ఆరు నెలలుగా బిల్లులు లేకుండా విద్యార్థులకు భోజనం ఏ విధంగా పెడతారు? అటెండర్ అన్నం పెడుతున్నప్పుడు విద్యార్థులు అర్ధాలతో ఉన్నారు మెస్ బిల్లులు విడుదల చేయాలని గుర్తు చేయండి.కనీసం అన్నం తినేటప్పుడు అయినా విద్యార్థులు గుర్తొచ్చి మెస్ బిల్లులు విడుదల చేస్తాడేమో. పాలన అంటే ప్రతిపక్షాల మీద కేసులు పెట్టడం ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడం కాదు. పాలన అంటే ఇచ్చిన హామీలను అమలు చేయడం. ప్రజల మధ్యలో ఉండడం. పోలీసుల మధ్య ఉండడం కాదు. ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం చేస్తున్నారు మూ అక్రమ కేసులు పెట్టి జైల్లో వేసే ప్రయత్నం చేస్తున్నారు. పెట్టాల్సింది అక్రమ కేసులు కాదు పేద విద్యార్థులకు అన్నం పెట్టు." అని హరీశ్ రావు అన్నారు.

## కొమురవెల్లి మల్లన్న జాతరకు భారీ ఏర్పాట్లు

సిద్దిపేటడిసెంబర్ 12,,ప్రజావినికిడి: సిద్దిపేట జిల్లా చేర్యాలలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామివారి కల్యాణం, జాతరలను తెలంగాణ ఆధ్యాత్మిక సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వైభవోపేతంగా నిర్వహించాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. వేలాదిగా జాతరకు తరలివచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని ఏ చిన్న పొరపాటు తలెత్తకుండా పటిష్టమైన కార్యాచరణతో ఏర్పాట్లు చేయాలని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు. గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయం దేవాదాయ ధర్మాదాయ మంత్రిత్వశాఖ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో మంత్రి సురేఖ సిద్దిపేట జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, సిద్దిపేట కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారులు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ,

సిద్దిపేట అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) అబ్దుల్ హమీద్, ఆర్డివో, కొమురవెల్లి ఆలయ ఏఈఓ శ్రీనివాస్, ఆర్టిసి డిపో మేనేజర్, డిఎంహెచ్ఓ, డిపిఓ, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి,గ్రామీణ నీటి సరఫరా, ఫైర్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ తదితర శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ గత సంవత్సరం కంటే మరింత వైభవోపేతంగా మల్లికార్జున స్వామివారి కల్యాణం, జాతరను నిర్వహించనున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు.



డిసెంబర్ 29 ఉదయం 10.45 గంటలకు శ్రీ మల్లికార్జున స్వామి వారి కల్యాణాన్ని, జనవరి 19 నుండి 10 వారాలపాటు మార్చి 24 వరకు జాతరను నిర్వహించేందుకు నిర్ణయించినట్లు మంత్రి సురేఖ ప్రకటించారు. ఈ దిశగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేయాలని పోలీస్, విద్యుత్, వైద్యారోగ్యం, ఆర్టీసి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, ఆర్ అండ్ బి తదితర శాఖల అధికారులను మంత్రి సురేఖ ఆదేశించారు. భక్తులు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కల్యాణాన్ని వీక్షించి,స్వామి అమ్మవార్లను దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యేలా వీలుగా అన్ని శాఖల సమన్వయంతో వ్యవహరించేలా చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ కలెక్టర్ ను నిర్దేశించారు. గత సంవత్సరం అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కల్యాణ వేదికను విశాలంగా తీర్చిదిద్దాలని ఈవోను మంత్రి సురేఖ ఆదేశించారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, అమ్మవార్లు బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలకు కిరీటాల తయారీ పనుల పై మంత్రి సురేఖ ఆరా తీశారు. రూ. 9.776 కోట్లు ఎస్డిఎఫ్ నిధులు, రూ. 36.18 కోట్ల దేవాదాయ శాఖ నిధులతో చేపడుతున్న కార్యక్రమాలను ఈవో మంత్రి సురేఖకు వివరించారు. కిరీటాల తయారీ పనులు పురోగతిలో ఉన్నట్లు తెలిపారు. ప్రతి రోజూ స్వామివారికి అలంకరించే పూలను తదనంతరం పడేయకుండా అగర్‌బత్తీలు తయారుచేసే సాంకేతికతను వాడుకుని దేవాలయ అవసరాలకు వినియోగించుకోవాలని మంత్రి సురేఖ ఈవోను నిర్దేశించారు.

భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు : ఎల్లమ్మ దేవాలయంలో మొక్కులు సమర్పించుకునే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు కల్యాణోత్సవానికి, జాతరకకు పెద్ద సంఖ్యలో తరలివచ్చే పరిస్థితులున్నందున ఈ దిశగా చర్యలు చేపట్టాలని సిద్దపేట డిపో మేనేజర్ కు మంత్రి సురేఖ సూచించారు. భక్తుల క్యూలైన్లు, బారికేడ్లు, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు, సిసి కెమరాల నిఘా, వివిఐపిలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు, భక్తులకు దారులను తెలిపేలా సైన్ బోర్డులు, తాగునీటి సదుపాయం, మెడికల్ క్యాంపు, లాక్టేషన్ గదులు తదితర ఏర్పాట్లు చేయాలని మంత్రి సంబంధిత అధికారులకు సూచించారు. జాతర సమయానికి వేసవి కాలం రానుండటంతో భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, నడిచే మార్గాల్లో మ్యాట్లు, వృద్ధులు, వికలాంగులు, గర్భిణులకు బ్యాటరీ వాహనాలు తదితర ఏర్పాట్లు చేయాలన్నారు.

## నిఖేశ కుమార్‌ను కస్టడీలోకి తీసుకున్న ఏసీబీ

### ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టైన నీటిపారుదల శాఖ ఏఈఈ

హైదరాబాద్‌డిసెంబర్ 12,,ప్రజావినికిడి: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టైన నీటి పారుదల శాఖ ఏఈఈ నిఖేశ్ కుమార్‌ను ఏసీబీ అధికారులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. చంచల్‌గూడ జైలు నుంచి నాంపల్లి ఏసీబీ కార్యాలయానికి తరలించారు. అధికారులు అతనిని నాలుగు రోజుల పాటు విచారిస్తారు. నిఖేశ్ కుమార్ సమక్షంలో బ్యాంకు లాకర్లు తెరవనున్నారు. నిఖేశ్ కుమార్ బినామీ ఆస్తుల వివరాలను



అధికారులు ఇప్పటికే సేకరించారు. అతని స్నేహితుల బ్యాంకు లాకర్ ఓపెన్ చేసి భారీగా బంగారంతో పాటు కీలకమైన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.నిఖేశ్ కుమార్ నీటిపారుదల శాఖలో ఏఈఈగా పని చేస్తున్నాడు. అతను ఇటీవల ఏసీబీకి చిక్కాడు. నిఖేశ్ కుమార్ ఇల్లు, అతని స్నేహితుల ఇళ్లలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో 17.73 కోట్ల అక్రమాస్తులను ఏసీబీ గుర్తించింది. ఒక లాకర్‌లో మరో కిలోన్నర బంగారు ఆభరణాలు లభ్యమయ్యాయి. వీటన్నింటి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.100 కోట్లకు పైనే ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# ఇటలీ నుంచి వచ్చిన సోనియమ్మకు బతుకమ్మ తెలియదేమో..

# తెలంగాణలో పుట్టిన మీకు కూడా బతుకమ్మ గురించి తెలియదా?

- బతుకమ్మ పండుగకు రెండు చీరలు అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం లో బతుకమ్మనే లేకుండా చేశారు.
- కోదండరాం మీకు ఎమ్మెల్సీ ఇచ్చి మీ చేతులకు సంకెళ్లు వేశారా?
- తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ బతుకమ్మ ప్రాశస్త్యాన్ని అన్ని తెలియజేసింది మీరు కాదా?
- మరి బతుకమ్మ విగ్రహం ఏర్పాటులో కోదండరాం మౌనం వహించడం దేనికి సంకేతం..
- అసలు బతుకమ్మ లేదంటున్న కాంగ్రెస్ నాయకులారా...
- గెలిచిన తర్వాత కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులు మహిళా శాసనసభ్యులు బతుకమ్మ ఆడ లేదా?
- బతుకమ్మ లేదంటున్న కాంగ్రెస్ నాయకుల్లారా తెలంగాణ మహిళలకు మీరు క్షమాపణలు చెప్పాల్సిందే..
- క్షమాపణలు చెప్పకుంటే మిమ్మల్ని తెలంగాణ ప్రజలు రోడ్లపై తిరగనియ్యరు..
- తెలంగాణ భవన్లో బతుకమ్మ లేదన్న కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలపై మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఫైర్..




ప్రజావినికిడి,(హైదరాబాద్):
తెలంగాణ ప్రాంతంలో అసలు ఎవరు బతుకమ్మ ఆడరు, తెలంగాణ ఇండ్లలో అసలు బతుకమ్మనే లేదు,బతుకమ్మ అనేది కేవలం బీఆర్ఎస్ పార్టీ తెచ్చింది అని, తెలంగాణలో 70 శాతం మంది అసలు బతుకమ్మనే ఆడరని, మేమైతే ఎప్పుడు గ్రామాలలో బతుకమ్మను చూడలేదని బెల్లం నాయక్,అద్దంకి దయాకర్,యెన్నం శ్రీనివాస్ రెడ్డి లు చేస్తున్న ఈ వ్యాఖ్యలను ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి మాట్లాడుతూ, అర్థం లేని మాటలు, అర్థరహితమైన మాటలు,ఏం మాట్లాడుతున్నారో తెలియని పరిస్థితుల్లో చేస్తున్న వ్యాఖ్యలకు కాంగ్రెస్ నాయకులు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ పాత్ర ఎంతో ఉందని,తెలంగాణ వచ్చిన తర్వాత అధికారికంగా ప్రకటించిన తర్వాత అన్ని ప్రభుత్వ ఆఫీసుల్లో ఎంతో ఘనంగా బతుకమ్మ సంబరాలు కుల మతాలకతీతంగా ఎంతో ఘనంగా జరుపుకున్నారని, సద్దుల బతుకమ్మ ఎందుకు జరుపుకుంటారో కూడా,దసరా పండుగ ప్రత్యేకత కూడా తెలియని,తెలంగాణ పట్ల విచక్షణ జ్ఞానము లేని కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారన్నారు.ఇచ్చిన హామీలను నెరవేర్చలేక డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతూ తెలంగాణ సంస్కృతిని దెబ్బతీస్తున్నారని అన్నారు.కేవలం తెలంగాణకే పరిమితమైన బతుకమ్మ పండుగ కెసిఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా ప్రసారమాధ్యమాల్లో ప్రచారం అయిన విషయం కాంగ్రెస్ నాయకులకు కనిపించడం లేదా అన్నారు.యెన్నం శ్రీనివాస్ రెడ్డి అసలు నువ్వు ఇంతకు తెలంగాణలోనే పుట్టావా,పుడితే తెలంగాణలో బతుకమ్మ పండుగ, తెలంగాణ మహిళలందరూ ఎంత ప్రత్యేకంగా జరుపుకుంటారో తెలియదా అని ప్రశ్నించారు.ఈ బతుకమ్మపై కాంగ్రెస్ నాయకులందరూ ఎక్కడ చర్చ పెట్టిన మేము సిద్ధమేనని, అందుకు మీరు సిద్ధమా అంటూ ప్రశ్నించారు. ప్రపంచంలో ఉన్న ఎందరో ప్రజలు బ్రతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకుంటూ మన తెలంగాణ సంస్కృతి సాంప్రదాయ ఆచారాలను పాటిస్తుంటే




రేవంత్ రెడ్డి ప్రభుత్వం,కాంగ్రెస్ నాయకులకు మాత్రం బతుకమ్మ కనిపించడం లేక బతుకమ్మపై అర్థరహిత మాటలు మాట్లాడుతున్నారన్నారు.తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రొఫెసర్ కోదండరాం తెలంగాణ ఉద్యమంలో పాల్గొని తిరిగినప్పుడు బతుకమ్మ గురించి చాలా చక్కగా వివరించి,బతుకమ్మ ప్రాశస్త్యాన్ని తెలంగాణ ప్రజలకు తెలియజేసిన కోదండరాం కాంగ్రెస్ నాయకులు బతుకమ్మపై చేస్తున్న నీచ నిక్కృష్టపు మాటలకు ఎందుకు మౌనం వహిస్తున్నారని, ఎమ్మెల్సీ పదవి ఇచ్చి మీకు సంకెళ్లు వేశారా అంటూ ప్రశ్నించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ గురించి అద్భుతంగా కోదండరాం వర్ణించిన వీడియో ప్రదర్శించారు. మొన్నటి ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీ వారు బతుకమ్మ సంబరాలు చేసిన విషయం అప్పుడే మర్చిపోయారా అంటూ,గెలిచిన తర్వాత కూడా కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులు,అదేవిధంగా మహిళా శాసనసభ్యులు కూడా బతుకమ్మలు పేర్చి బతుకమ్మ ఆడిన విషయం మర్చిపోయారా అంటూ ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఇలాంటి వ్యాఖ్యలకు తెలంగాణ మహిళలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా చేసిన కాలంలో తెలంగాణ మహిళల పట్ల గౌరవంతో తెలంగాణ లో బతుకమ్మను అధికారికంగా ప్రకటించి బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తే, మా ప్రభుత్వం వచ్చిన తర్వాత బతుకమ్మ పండుగకు రెండు చీరలు ఇస్తామని తెలంగాణ మహిళలను మోసం చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు.మీరే కదా బతుకమ్మ పండుగకు చీరలు ఇస్తామన్నది, తెలంగాణ మహిళలు చీరలు అడిగినంత మాత్రాన అసలు బతుకమ్మ పండుగనే లేదనే విషయం మాట్లాడడం కాంగ్రెస్ నాయకులకే చెల్లిందని ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి అన్నారు. తెలంగాణ మహిళల ఔన్నత్యాన్ని కించపరుస్తూ, బతుకమ్మ పండుగనే లేదని కించపరుస్తూ ఇటలీ సంస్కృతికి తెరలేపుతున్నారని ఘాటుగా విమర్శించారు. రానున్న రోజుల్లో తెలంగాణ ప్రజలు తెలంగాణ మహిళాలోకం మీకు కచ్చితంగా సమాధానం చెప్తారని, తెలంగాణ సంస్కృతిని కించపరిచే ఎవరిని రోడ్లపై తిరగనీయకుండా చేస్తారని,మీరు కచ్చితంగా తెలంగాణ మహిళలకు క్షమాపణ చెప్పాల్సిందేనని అన్నారు.అసలు తెలంగాణ సంస్కృతిని కాదని మీకు తెలంగాణలో తిరిగి హక్కు లేదన్నారు. తెలంగాణ తల్లి విగ్రహంలో ఉన్న బతుకమ్మను తీసివేసి, చేతి గుర్తుకు ఓటు వేయాలనే దిశగా బతుకమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, ఇటలీ నుంచి వచ్చిన సోనియమ్మకు బతుకమ్మ గురించి తెలియకున్నా, తెలంగాణలో పుట్టిన మీ కన్నా బతుకమ్మ గురించి తెలియదా అంటూ ఎద్దేవా చేశారు.

## సీ.ఎం.రిలీఫ్ ఫండ్ తో ఎంతో మంది పేదలకు లబ్ధి

### :ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి

ప్రజావినికిడి,(ఎల్బీనగర్):
హస్తినపురం డివిజన్ పరిధిలోని షిరిడీ సాయినగర్ నందు నివాసం ఉంటున్న ఉమ గౌరిశంకర్ నరాలకు సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో అయితే వారి యొక్క ఆర్థికస్థితులు బాగలేక వారు వారి యొక్క కుటుంబసభ్యులు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి ని సంప్రదించారు.వెంటనే స్పందించిన సుదీర్ రెడ్డి అట్టి ఆపరేషన్ కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయడం జరిగింది.దానికి గాను



బాధితుడు ఉమ గౌరిశంకర్ కు1,50,000 రూపాయల ఎల్.ఓ.సీ.అందజేస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి

వారికి 1,50,000(లక్ష యాభై వేలరూపాయలు) ఎల్.ఓ.సీ.చెక్కు మంజూరు కావడం జరిగింది.ఈ సందర్భంగా సుదీర్ రెడ్డి మాట్లాడుతూ, పేదల ఆరోగ్య పరిరక్షణకు సీ.యం.సహాయనిధి దోహదపడుతుంది అని అన్నారు.ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిది అని అన్నారు.పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీ.ఎం.సహాయనిది అండగా ఉంటుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ భారస నాయకులు శ్రీనివాస్ నాయక్,బాధిత తల్లిసుగుణ పాల్గొన్నారు.

## నేడు లష్కర్ గూడా గ్రామంలో మునుకుంట్ల శ్రీధర్ గౌడ్ గురు స్వామి ఆధ్వర్యంలో


## శ్రీ అయ్యప్ప స్వామి 18 వ మహా పడిపూజ



ప్రజావినికిడి,(అబ్దుల్లాపూర్మెట్): మండలం: లష్కర్ గూడ గ్రామం:మునుకుంట్ల శ్రీధర్ గౌడ్ గురు స్వామి ఆద్వర్యంలో 18 మెట్టు మహా పడిపూజ మహెూత్సవం శుక్రవారం రోజున అంగరంగ వైభవంగా గుజ్జుల జనార్ధన్ గురుస్వామి ఆశీస్సులతో కళ్లెం శంకర్ రెడ్డి ప్రధాన గురుస్వామి ఆశీస్సులతో అబ్దుల్లాపూర్ మెట్టు మండల మాజీ జెడ్పిటిసి బింగి దేవదాస్ గౌడ్, గురుస్వామి,సిద్ధగౌని నాగేష్ గౌడ్,బ్రహ్మశ్రీ వై రాజన్ నంబూద్రి మలయాళ తాంత్రిక పూజారి పర్యవేక్షణలో నిర్వహిస్తున్నామని అయ్యప్ప స్వాములు అందరూ ఈ మహా పడిపూజ లో పాల్గొని నన్ను ఆశీర్వదించగలరని ప్రార్థిస్తున్నానను అని తెలిపారు.ఈ కార్యక్రమంలో నక్క వెంకటేష్ గౌడ్ గురు స్వామి పల్లె నరసింహ గౌడ్,గురు స్వామి దాచేపల్లి కృష్ణ, గురుస్వామి భజన మండలి గాన కోకిల పెద్దపులి ఈశ్వర్, అన్నదాన ప్రభువు మునుకుంట్ల గిరీష్ గౌడ్ హంస దంపతులు ప్రతి ఒక్కరు అయ్యప్ప స్వాములు అందరూ రావాల్సిందిగా కోరుతున్నానని తెలిపారు.

## ఆర్ క్రిష్ణయ్యని సన్మానించిన షాద్ నగర్ బీసీ సేన నాయకులు..





ప్రజావినికిడి,(షాద్ నగర్):
బీసీ సేన జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో షాద్ నగర్ బీసీ సేన కమిటీ హైదరాబాద్ ఆర్ కృష్ణయ్య నివాసంలో రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైనందున అతనిని కలిసి సన్మానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో బీసీ సేన రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పసుపుల ప్రశాంత్ షాద్ నగర్ అసెంబ్లీ అధ్యక్షులు నరేష్ ప్రధాన కార్యదర్శి నరసింహ చారి,కొందుర్గ్ మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్ గౌడ్ నందిగామ మండల అధ్యక్షులు ఆంజనేయులు (మారుతి) యాదవ్ ఉపాధ్యక్షులు రాఘవేందర్ చారి,బీసీ సేన నాయకులు కేశమోని రామచెందర్ యాదవ్,కుమ్మరి కృష్ణ,రాము చారి,రాకేష్ చాకలి,శ్రీచరనూ తేజు ముదిరాజ్,శివ కుమార్,గిరి ఉగ్గి రమేష్ ముదిరాజ్,రాజేష్ శ్రీను యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## రత్నదీప్ సైదాబాద్ బ్రాంచ్ (1 )బెస్ట్ ఎంప్లాయ్ అవార్డును అందుకున్న రాపోలు రేణుక..

ప్రజావినికిడి,(ఎల్బీనగర్):
రత్నదీప్ ఆధ్వర్యంలో బెస్ట్ ఎంప్లాయ్ డే ను పురస్కరించుకొని గురువారం రత్నదీప్ సైదాబాద్ (1)బ్రాంచ్ లో ఉద్యోగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది.ఉత్తమ ఉద్యోగులకు అవార్డులను ప్రకటించింది.అందులో భాగంగా క్యాషియర్ గా పనిచేస్తున్న రాపోలు రేణుక ఎంపిక కావడం తో మేనేజర్ వీరస్వామి చేతుల మీదుగా బెస్ట్ ఎంప్లాయ్ అవార్డును అందుకోవడం జరిగింది.ఈ కార్యక్రమం లో సూపర్ వైజర్ శ్యామల, బయ్యార్,మమత, పూజ,భవాని, జంగమ్మ,తిరుపతమ్మ, శశికల,సంతోషి, సంధ్య,లలిత, తదితరులు పాల్గొన్నారు.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

# ట్రాఫిక్ చలాన్ కట్టకపోతే విద్యుత్, నీళ్ల సరఫరా కట్

అమరావతి డిసెంబర్ 12,,ప్రజావినికిడి:
ట్రాఫిక్ చలాన్ కట్టకపోతే ఇళ్లకు విద్యుత్, నీళ్ల సరఫరా కట్ చేయాలని హైకోర్టు పోలీస్ అధికారులను ఆదేశించింది. హెల్మెట్ ధరించని కారణంగా కేవలం మూడు నెలల వ్యవధిలోనే 600 మందికి పైగా చనిపోవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. చట్టాలు నిబంధనలను కఠినంగా అమలు చేస్తే ఎలాంటి పరిస్థితులు రావని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ సీరియస్ అయింది.ఎపిలో రోడ్డు ప్రమాదాలలో మరణించిన వారి సంఖ్య రోజు రోజుకి పెరుగుతుంటం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ, నిబంధనలను ఉల్లంఘించిన వారికి జరిమానా విధించడం లేదంటూ న్యాయవాది యోగేష్ వేసిన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు అధికారుల నిర్లక్ష్య పోకడలను ఎత్తి చూపింది.ఎవరైనా హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం నడిపితే గనుక కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించింది. ఒకవేళ పెండింగ్‌లో ఉన్న చలానాలు కట్టకపోతే వారి ఇళ్లకు విద్యుత్, నీటి సరఫరా నిలిపేయాలని సూచించింది. వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి చేస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ప్రభుత్వం అమలు చేయడం



లేదని, ఇక ఏపీ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాల డ్రైవర్లు తెలంగాణ సరిహద్దుకు వెళ్ళగానే సీట్ బెల్ట్ పెట్టుకుంటున్నారని, కానీ ఏపీలో మాత్రం నిబంధనలను ఎవరూ పాటించడం లేదని పిటిషన్ పేర్కొన్నారు.అద్దాలకు నల్ల ఫిలిమ్ ఉన్న కార్లు హైదరాబాద్‌లో కనిపించవు. కానీ ఇక్కడ ఎక్కువగా కనిపిస్తున్నాయని ఇందుకు చట్ట నిబంధనలను కఠినంగా అమలు చేయకపోవడమే కారణం అంటూ పిటిషన్ వేసిన న్యాయవాది వాదనలు వినిపించారు. ప్రభుత్వం వైపు తరపు న్యాయవాది చలాన్లు, తనిఖీలు అన్ని చేస్తున్నామని సమాధానం చెప్పినప్పటికీ, జరిగిన ఘటనల్లో హెల్మెట్ లేకుండా చనిపోయిన వారే చాలామంది ఉన్నారని హైకోర్టు దృష్టికి రావడంతో ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకుంది.హైకోర్టు హెల్మెట్ తప్పనిసరి చేయాలని ఉత్తర్వులు జారీ చేసిన జూన్ 26 నుండి సెప్టెంబర్ 4 మధ్య 666 మంది చనిపోవడం చిన్న విషయం ఏమీ కాదంటూ ఏపీ హైకోర్టు సీరియస్ అయింది. హెల్మెట్ లేకుండా ఎవరు కనిపించిన ఉపేక్షించొద్దంటూ ఆదేశాలు ఇచ్చింది. పోలీసులు నిబంధనలను కఠినంగా అమలు చేయాలని లేని పక్షంలో మరణాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతుందని కేవలం మూడు నెలల్లో ఇన్ని మరణాలు ఎలా అంటూ ప్రశ్నించింది. చలానాలు చెల్లించుకుంటే వాహనాలు సీజ్ చేసేందుకు చట్ట నిబంధనలు వెసులుబాటు కల్పిస్తున్నప్పటికీ అలా చేయకుండా ఎవరు ఆపారంటూ ఆర్టీఏ అధికారులను సైతం హైకోర్టు ప్రశ్నించింది.అధిక జరిమానాలు విధించడం వల్ల సమస్యకు పరిష్కారం దొరక్కపోగా సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకు ప్రస్తుతం విధిస్తున్న జరిమానాలనే కఠినంగా అమలు చేస్తే సరిపోతుందని హైకోర్టు సూచించింది. తదుపరి విచారణలో ట్రాఫిక్ ఐజీని హైకోర్టులో హాజరు కావాలని ఆదేశించింది. ఇప్పటివరకు ఎన్ని అవగాహన కార్యక్రమాలు చేశారు. యాక్సిడెంట్స్ కాకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నారో పూర్తి వివరాలు కోర్టు ముందు ఉంచాలని ఆదేశించింది.

# పార్టీ కోసం పని చేసిన వారిని పట్టించుకోరా?

## : సొంత పార్టీ నేతలపై జగ్గారెడ్డి ఆగ్రహం

హైదరాబాద్‌డిసెంబర్ 12,,ప్రజావినికిడి: పార్టీ కోసం పని చేసిన వారిని, ఎన్నికల్లో గెలిచేందుకు కృషి చేసిన వారిని ఎవరూ పట్టించుకోరా? అని తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సొంత పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఏఐసీసీ కార్యదర్శి విష్ణు, దీపాదాస్ మున్షిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో తాము సీనియర్లమని, తమను సంప్రదించకుండానే నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు.కొత్త వారికి ప్రాధాన్యత ఇచ్చే విషయం ఖరారయ్యే వరకు తమకు సమాచారం ఇవ్వరా? అని నిలదీశారు. పార్టీ కోసం పని చేసిన వారిని,



ఎన్నికల్లో గెలిచేందుకు కృషి చేసిన వారిని పట్టించుకోవాలన్నారు. అసలు విష్ణు ఏఐసీసీ కార్యదర్శిగా ఉన్నారా? లేక వేరే రాష్ట్రానికి వెళ్లిపోయారా? అని నిలదీశారు. మెదక్ జిల్లాను తానే చూస్తున్నానని చెప్పిన విష్ణు ఎక్కడకు వెళ్లారని ప్రశ్నించారు. దీపాదాస్ కూడా తెలంగాణ రాష్ట్రానికే పని చేస్తున్నారా? వేరే రాష్ట్రానికి వెళ్లారా? అని చురక అంటించారు.

# మరో తేదీ ఇవ్వండి

## : నాగార్జున 'పరువు నష్టం కేసు'లో కోర్టుకు తెలిపిన కొండా సురేఖ

హైదరాబాద్‌డిసెంబర్ 12,,ప్రజావినికిడి: :సినీ నటుడు నాగార్జున వేసిన పరువు నష్టం కేసులో తాను కోర్టుకు హాజరుకాలేకపోతున్నానని, మరో తేదీ ఇవ్వాలని తెలంగాణ మంత్రి కొండా సురేఖ కోర్టును కోరారు. దీంతో నాంపల్లి కోర్టు విచారణను వాయిదా వేసింది.



తనపై చేసిన వ్యాఖ్యలకు గాను నాగార్జున మంత్రి కొండా సురేఖపై పరువు నష్టం కేసు వేశారు. ఈ కేసులో మంత్రికి ఇదివరకే కోర్టు సమన్లు జారీ చేసింది. వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొంది.అయితే మంత్రిగా వివిధ కార్యక్రమాల కారణంగా సురేఖ విచారణకు హాజరు కాలేకపోతున్నారని ఆమె తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. మరో తేదీ ఇస్తే హాజరవుతారని కోర్టుకు తెలిపారు. దీంతో నాంపల్లి కోర్టు విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది.

## : ప్రభుత్వ పాలన పట్ల 100 శాతం ప్రజలు సంతోషంగా ఉంటారనుకోవడం లేదు: భట్టి విక్రమార్క

హైదరాబాద్‌డిసెంబర్ 12,,ప్రజావినికిడి:
ప్రభుత్వ పాలన పట్ల 100 శాతం ప్రజలు సంతోషంగా ఉంటారని తాను భావించడం లేదని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాపాలన పట్ల ఎక్కువమంది ప్రజలు మాత్రం సంతోషంగా ఉంటారని భావిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యం అంటేనే ఎంతో కొంత వ్యతిరేకత ఉంటుందన్నారు. తమ ఏడాది పాలనపై రాష్ట్రంలోని 50 శాతానికి పైగా ప్రజలు సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు.ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఆక్రమణలను ఆపేందుకే హైడ్రా అన్నారు. హైడ్రాకు పేద, ధనిక అనే తేడా ఉండదన్నారు. తెలంగాణ తల్లి గతంలో అధికారికంగా లేదన్నారు. మంత్రివర్గ విస్తరణపై



తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. కేబినెట్ విస్తరణపై పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందన్నారు.

# జర్నలిస్ట్‌ను కొట్టింది నిజమే... అందుకు చింతిస్తున్నాను కానీ

**: మోహన్ బాబు మరో ఆడియో విడుదల**
**మీ ఇంట్లో ఎవరైనా దూరితే అంగీకరిస్తారా? అని ప్రశ్న**
**మీడియా ప్రతినిధి తనకు తమ్ముడి లాంటివాడన్న మోహన్ బాబు**
**కొట్టడం తప్పైనప్పటికీ ఏ సందర్భంలో కొట్టానో ఆలోచించాలని విజ్ఞప్తి**
**పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న మోహన్ బాబు**

హైదరాబాద్‌డిసెంబర్ 12,,ప్రజావినికిడి: నేను మీడియా ప్రతినిధిని కొట్టిన మాట నిజమే... కానీ ఏ సందర్భంలో కొట్టానో ఆలోచించాలని, అయినప్పటికీ అలా కొట్టినందుకు చింతిస్తున్నానని సినీ నటుడు మోహన్ బాబు అన్నారు. ఈ మేరకు ఆయన ఆసుపత్రి నుంచి విడుదలయ్యాక వెల్లడించారు. ఈ మేరకు 11 నిమిషాల నిడివి గల వీడియోను విడుదల చేశారు.
జర్నలిస్టును కొట్టాలనుకోలేదు... చింతిస్తున్నా



జర్నలిస్ట్‌ను కొట్టాలని తాను దైవసాక్షిగా అనుకోలేదని వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. కుటుంబ సమస్యల్లో ఎవరైనా జోక్యం చేసుకోవచ్చా? అని ప్రశ్నించారు. ప్రజలు, రాజకీయ నాయకులు దీనిపై ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. తన ఇంట్లోకి దూసుకొచ్చేవారు జర్నలిస్టులా? కాదా? తనకు తెలియదని వ్యాఖ్యానించారు. మీడియాను అడ్డు పెట్టుకొని తనపై దాడి జరగవచ్చని భావించానన్నారు. జరిగిన ఘటనకు మనస్ఫూర్తిగా చింతిస్తున్నట్లు తెలిపారు. తాను కొట్టడం తప్పే కావొచ్చు... కానీ ఏ సందర్భంలో అలా చేశానో ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. మీ ఇంట్లో ఎవరైనా దూరితే... మీ ఏకాగ్రతను భగ్నం చేస్తే అంగీకరిస్తారా?... న్యాయాధిపతులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, వ్యాపారస్తులు, మీడియా ప్రతినిధులు దీనిపై ఆలోచించాలన్నారు. నేను కొట్టిన దెబ్బ అతనికి తగిలిందన్నారు. అందుకు బాధపడుతున్నానని... ఆ మీడియా ప్రతినిధి తనకు తమ్ముడి లాంటి వాడన్నారు. మీడియా ప్రతినిధి భార్యాబిడ్డల గురించి తాను ఆలోచించానని... కానీ తన గురించి ఎవరూ ఆలోచించలేదన్నారు. తాను సినిమాల్లో నటిస్తానని... నిజజీవితంలో మాత్రం నటించాల్సిన అవసరం లేదన్నారు.మీకు టీవీలు ఉన్నాయి... మాకు టీవీలు (చానళ్లు) లేవు... రేపు నేను కూడా టీవీని పెట్టవచ్చు... అది కాదు గొప్ప... కానీ మీడియా ప్రతినిధి మనసును గాయపర్చినందుకు చింతిస్తున్నానన్నారు. మనసును గాయపెట్టాక చింతించి లాభం ఏమిటని ఎవరైనా అడిగితే ఇక నేనేం చేయను... మీరు చేసిందేమిటని ప్రశ్నించారు. మళ్లీ మళ్లీ చెబుతున్నాను... అసలు అతను నిజంగా జర్నలిస్టా? కాదా? అని నాకు ఎలా తెలుస్తుంది? అని ప్రశ్నించారు. కొట్టడం తప్పైనప్పటికీ ఏ సందర్భంలో కొట్టానో చూడాలన్నారు. కానీ మీరు ఈ విషయాలు చెప్పడం లేదన్నారు. పైన భగవంతుడు చూస్తున్నాడని వ్యాఖ్యానించారు.

# నాలెడ్జి సొసైటీ మన ప్రభుత్వ లక్ష్యం...



- మానవ వనరుల శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష
- నాలెడ్జి సొసైటీ లక్ష్యానికి లోబడి విద్యావ్యవస్థలో మార్పులు చేయాలి
- అంతర్జాతీయ విద్యాసంస్థలకు దీటుగా కరిక్యులమ్ లో మార్పులు
- కలెక్టివ్ టీమ్ బిల్డింగ్ తో అభివృద్ధికి చర్యలు చేపట్టాలని నిర్దేశం

అమరావతి డిసెంబర్ 12,,ప్రజావినికిడి:
నాలెడ్జి సొసైటీ మన ప్రభుత్వ లక్ష్యం... ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోరారు. మానవ వనరుల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడారు. "ఆన్ లైన్, ఆఫ్ లైన్ విధానాల ద్వారా అంతర్జాతీయంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు తేవాలి. ప్రైవేటు విద్యావ్యవస్థను తొక్కేయడం మన విధానం కాదు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్యారంగాన్ని తీర్చిదిద్దాలన్నదే తమ ధ్యేయం. రాబోయే రోజుల్లో నాలెడ్జి ఎకానమీలో తెలుగు విద్యార్థులు నెం.1గా నిలవాలి. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో పేరెన్నికగన్న విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలకు ప్రత్యేక బృందాలను పంపి అక్కడ బోధన, అభ్యసన పద్ధతులపై అధ్యయనం చేయాలి. తదనుగుణంగా కరిక్యులమ్ లో మార్పులు చేసి, ఎన్ఐఆర్ఎఫ్, గ్లోబల్ ర్యాంకింగ్స్ మెరుగుదలకు చర్యలు చేపట్టాలి. సివిల్ ఏవియేషన్, గ్రీన్ ఎనర్జీ, టూరిజం రంగాల్లో భవిష్యత్ అవకాశాలను అంచనావేసి ఆయా యూనివర్సిటీల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి. స్కిల్స్, ఎంప్లాయ్ మెంట్ ను బ్యాలెన్స్ చేయాల్సి ఉంది. ఇందుకోసం అమరావతి రాజధానిలో ఏర్పాటుచేసే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ తో రాష్ట్రంలోని 5 జోన్లలోని స్కిల్ డెవలప్ మెంట్ సంస్థలను అనుసంధానిస్తాం. డిజిటల్ టీచింగ్, లెర్నింగ్ పై దృష్టి సారించాలి. సొసైటీ అవసరాలను బట్టి స్కిల్ అప్ గ్రేడేషన్ చేపట్టాలి. ఒకేషనల్ విద్యపై దృష్టిసారించాలి. పాఠశాలల్లో రేటింగ్ మెరుగుదలకు కలెక్టివ్ టీమ్ బిల్డింగ్ తో ర్యాంకింగ్స్ మెరుగుదలకు కృషిచేసి, విద్యారంగాన్ని అభివృద్ధి చేసేందుకు అధికారులంతా కృషిచేయాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజ్ఞప్తిచేశారు.

# సరస్వతి పవర్ భూములు వెనక్కి

**ప్రభుత్వం ఉత్తర్వులు! మాజీ సీఎం జగన్‌కు షాక్..**
**అసైన్డ్ భూములను వెనక్కి తీసుకుంటూ సర్కార్ నిర్ణయం**
**మాచవరం మండలంలోని 17.69 ఎకరాల భూములను వెనక్కి**

అమరావతి డిసెంబర్ 12,,ప్రజావినికిడి:
డిప్యూటీ సీఎం ఆదేశాలతో మాచవరానికి చెందిన సరస్వతి పవర్ అసైన్డ్ భూముల పరిశీలన
రెవన్యూ అధికారుల నివేదిక అనంతరం కూటమి ప్రభుత్వం తాజా నిర్ణయంఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు కూటమి ప్రభుత్వం బిగ్ షాక్ ఇచ్చింది. సరస్వతి పవర్ అసైన్డ్ భూములను వెనక్కి తీసుకుంటూ ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. మాచవరం మండలంలోని 17.69 ఎకరాల భూములను వెనక్కి తీసుకుంటున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల వైఎస్ జగన్, ఆయన సోదరి షర్మిల, తల్లి విజయమ్మ ఆస్తుల వివాదం కోర్టుకు



చేరింది. దాంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు అధికారులు జగన్ తాలూకు మాచవరానికి చెందిన సరస్వతి పవర్ అసైన్డ్ భూములను పరిశీలించారు. ఈ సంస్థకు చెందిన భూములపై ఆరా తీయాల్సిందిగా అధికారులను పవన్ ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు అధికారులు ఆర్ఎస్ఆర్, ఎఫ్ఎంబీ రికార్డులను అధికారులు చెక్ చేశారు. మాచవరం ఎంఆర్ఓ క్షమారాణి, వీఆర్ఓ అఖిల్, ఆర్ఐ కోటేశ్వరరావు, సర్వేయర్ సాల్మన్ రాజు, దాచేపల్లి అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి కే విజయలక్ష్మి, బీట్ ఆఫీసర్లు వెంకటేశ్వర్లు, మనోజ్.. సరస్వతి సిమెంట్, పవర్ భూములను క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ఆ నివేదిక ఆధారంగా మాచవరం మండలంలోని 17.69 ఎకరాల భూములను వెనక్కి తీసుకుంటున్నట్లు సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది.

# జనగాం సహా నాలుగు జిల్లాల కలెక్టర్లకు తెలంగాణ హైకోర్టు నోటీసులు

**ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు పరిహారం ఇవ్వకపోవడంపై నోటీసులు**
**జనగాం, యాదాద్రి, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లకు నోటీసులు**

హైదరాబాద్‌డిసెంబర్ 12,,ప్రజావినికిడి:
ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు పరిహారం



విషయమై జనగాం సహా నాలుగు జిల్లాల కలెక్టర్లకు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. జనగాం, యాదాద్రి భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది.రైతు ఆత్మహత్యలపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై గత ఏడాది హైకోర్టులో విచారణ జరిగింది. పరిహారం ఇచ్చే అంశం పరిశీలనలో ఉందని, నాలుగు నెలల్లో చెల్లిస్తామని అప్పుడు ప్రభుత్వం... కోర్టుకు తెలిపింది. అయితే ఏడాది దాటినప్పటికీ ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు పరిహారం చెల్లించలేదంటూ కొండల్ రెడ్డి అనే వ్యక్తి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు.
ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు నాలుగు జిల్లాల కలెక్టర్లకు నోటీసులు ఇచ్చింది. ఈ పిటిషన్‌ను కోర్టు దిక్కరణ కింద ఎందుకు స్వీకరించకూడదో చెప్పాలని ఆ నోటీసుల్లో పేర్కొంది.

# షెకావత్ సర్ తో యానిమల్ బ్యూటీ రొమాన్స్!



ఫహాద్ ఫాజిల్ ఇప్పుడు పరిచయం అవసరం లేని పేరు. మాలీవుడ్ లో ఎంతో పెద్ద స్టార్ అయినా? తన స్టార్ డమ్ రెట్టింపు అవ్వడానికి కారణం మాత్రం టాలీవుడ్ అన్నది వాస్తవం. 'పుష్ప' సినిమాలోకి పహాద్ ఎంటర్ అయిన తర్వాత నటుడిగా ఫహాద్ కెరీర్ కొత్త టర్నింగ్ తీసుకున్న సంగతి తెలిసిందే. ఆయన మలయాళంలో నటించిన సినిమాలు సౌత్ లో అన్ని భాషల్లోనూ అనువాదం అవ్వడం మొదలైంది. అప్పటి వరకూ ఆయన సినిమాలు కేవలం మాలీవుడ్ కే పరిమితమయ్యేవి. కానీ నేడు దక్షిణాదిన అన్ని భాషల్లో రిలీజ్ అవుతున్నాయి. 'పుష్ప ది రైజ్' రిలీజ్ అయిన నాటి నుంచి ఇప్పటి వరకూ మూడు నాలుగు సినిమాలొచ్చాయి. వాటికి ఇక్కడా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇక 'పుష్ప-2' విజయంతో అన్ని భాషల్లోనూ తిరుగు లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ఫహాద్ పాజిల్ బాలీవుడ్ లోకి ఎంటర్ అవుతున్నాడు. ఇంతియాజ్ అలీ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు. 'ఇడియట్స్ ఆఫ్ ఇస్తాంబుల్' అనే టైటిల్ తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.ఇందులో ఫహాద్ కి జోడీగా యానిమల్ బ్యూటీ త్రిప్తీ డిమ్రీని హీరోయిన్ గా ఎంపిక చేయడం విశేషం. ఇదొక రొమాంటిక్ కామెడీ చిత్రం. హీరో-హీరోయిన్ మధ్య కొన్ని ఇంటిమేట్ సన్నివశాలు ఉన్నాయని అంటున్నారు. ప్రస్తుతం సినిమాకి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. వచ్చే ఏడాది సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించాలని సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాతో ఫహాద్ హిందీకి వెళ్లడం పై ఆయన సంతోషం వ్యక్తం చేసారు. చాలా కాలంగా హిందీ సినిమాలు చేయాలనుకున్నా? అవ్వలేదు. ఆ అవకాశం ఇప్పుడు లభించింది. నటుడిగా ఏ భాషలో అవకాశం వచ్చిన వదలను. అన్ని భాషల్లోనూ సినిమాలు చేసినప్పుడే రకరకాల పాత్రలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు.



# ఇక తెలుగు తెరపై ఐశ్వర్య రాజేశ్ హవా!



ఐశ్వర్య రాజేశ్ .. తమిళంలో వరుస సినిమాలతో దూసుకుపోతున్న హీరోయిన్. అందమైన .. ఆకర్షణీయమైన కళ్లు ఆమె సొంతం. తమిళంలో నాయిక ప్రధానమైన సినిమాలు చేయాలంటే నయనతార .. త్రిష తరువాత వినిపిస్తున్న పేరు ఆమెదే. తమిళంలోనే కాదు మలయాళ .. కన్నడ సినిమాలు చేయడంలోనూ ఆమె ఉత్సాహాన్ని చూపిస్తోంది. ఇక తెలుగులోను అడపాదడపా కనిపిస్తూనే ఉంది. ఐశ్వర్య రాజేశ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన దగ్గర నుంచి తన సత్తా చాటుకునే పాత్రల కోసం వెయిట్ చేస్తూనే వస్తోంది. నిజానికి ఐశ్వర్య రాజేశ్ కి ఉన్న టాలెంట్ కి ఈ పాటికే ఆమె నెక్స్ట్ లెవెల్ ను అందుకోవలసింది .. కానీ కాస్త ఆలస్యమైంది. ఓటీటీలో వచ్చిన ' ఫర్హాన' .. 'డ్రైవర్ జమున' అనే సినిమాలు ఆమెను తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువ చేశాయి. నటనలో ఐశ్వర్య రాజేశ్ కు వంకబెట్టడం కష్టమేననే విషయం చాలామందికి అర్థమైంది. అలాంటి ఐశ్వర్య రాజేశ్ సంక్రాంతికి తెలుగు ప్రేక్షకులను పలకరించడానికి రెడీ అవుతోంది.


వెంకటేశ్ సరసన నాయికగా ఆమె 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాను చేసింది. దిల్ రాజు నిర్మించిన ఈ సినిమాకి అనిల్ రావిపూడి దర్శకత్వం వహించాడు. ఇటీవల వెంకటేశ్ - ఐశ్వర్య రాజేశ్ కాంబినేషన్లో వచ్చిన 'గోదారి గట్టుమీద' పాట జనంలోకి దూసుకుని వెళ్లింది. గత సినిమాల్లో కంటే ఇందులో మరింత గ్లామరస్ గా ఐశ్వర్య రాజేశ్ మెరిసింది. తెలుగులో ఆమెకి పడిన పెద్ద సినిమా .. పెద్ద పాత్రగా దీనిని చెప్పుకోవచ్చు. ఈ సినిమా హిట్ అయ్యే లక్షణాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. అదే జరిగితే ఇక్కడ ఐశ్వర్య రాజేశ్ హవా కొనసాగడం ఖాయమేనని చెప్పుకోవాలి.

# ఆలోచింపజేసేలా
## బచ్చల మల్లి కొత్త పాట..




టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లరి నరేష్.. బచ్చల మల్లి మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. సోలో బ్రతుకే సో బెటర్ సినిమాతో మంచి హిట్ అందుకున్న తెలుగు డైరెక్టర్ సుబ్బు మంగాదేవి దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాలో మల్లు బ్యూటీ అమృతా అయ్యర్ హీరోయిన్ గా నటిస్తున్నారు. హాస్య మూవీస్ బ్యానర్ పై రాజేష్ దండా గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. రావు రమేష్, రోషిణి, అంకిత్ కొయ్య, హరితేజ, వైవా హర్ష తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. విశాల్ చంద్ర శేఖర్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే అన్ని పనులు పూర్తి చేసుకున్న ఆ సినిమాను క్రిస్మస్ కానుకగా రిలీజ్ చేస్తామని మేకర్స్ కొద్ది రోజుల క్రితం అనౌన్స్ చేశారు. డిసెంబర్ 20వ తేదీన వరల్డ్ వైడ్ గా థియేటర్లలో రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. అదే సమయంలో ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు. అందులో భాగంగా టీజర్ ను రిలీజ్ చేయగా.. మంచి రెస్పాన్స్ వచ్చింది. లవ్, మదర్ సెంటిమెంట్ బ్యాక్ డ్రాప్ తో కట్ చేసిన బచ్చల మల్లి టీజర్.. సినిమాపై ఆడియన్స్ లో భారీ అంచనాలను క్రియేట్ చేసింది. 1990 బ్యాక్ డ్రాప్ లో సాగే ఆ సినిమాలో నరేష్ పూర్తి రగ్డ్ లుక్ లో సందడి చేయనున్నారని క్లారిటీ ఇచ్చేశారు మేకర్స్. అయితే మ్యూజికల్ ప్రమోషన్స్ లో భాగంగా ఇప్పటికే రెండు సాంగ్స్ ను రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో ఆ రెండు పాటలు మంచి రెస్పాన్స్ అందుకోగా.. కొత్త సాంగ్స్ కోసం అంతా వెయిట్ చేస్తున్నారు.ఇప్పుడు మేకర్స్ థర్డ్ సింగిల్ ను రిలీజ్ చేశారు. మరీ అంత కోపం.. కానే కాదు అలంకారం అంటూ సాగుతున్న థర్డ్ లిరికల్ సాంగ్ ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. పూర్ణ చారి అందించిన లిరిక్స్ కు సింగర్ సాయి విఘ్నేష్ తన గాత్రంతో ప్రాణం పోశారు. విశాల్ చంద్రశేఖర్.. మరీ అంత కోపం సాంగ్ కు అద్భుతమైన మ్యూజిక్ అందించారు. విజువల్స్ చాలా నేచురల్ గా బాగున్నాయి. మొత్తం బ్లాక్ అండ్ వైట్ మోడ్ లో కనిపిస్తున్నా.. అందరినీ తెగ ఆకట్టుకుంటున్నాయి. సాంగ్ లిరిక్స్ ఆలోచింపచేసే విధంగా ఉన్నాయని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. లిరికల్ సాంగ్ ఆకట్టుకుంటుందని చెబుతున్నారు. మరి బచ్చల మల్లి మూవీ ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

# కిరణ్ అబ్బవరం.. వ్వాటే లుక్



'క' మూవీతో కెరియర్ లోనే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ ని యంగ్ హీరో కిరణ్ అబ్బవరం సొంతం చేసుకున్నాడు. ఈ సినిమా ఏకంగా 50 కోట్లకి పైగా కలెక్షన్స్ ని అందుకుంది. ఒక చిన్న హీరో సినిమాకి ఈ స్థాయిలో వసూళ్లు అంటే కచ్చితంగా రికార్డ్ అని చెప్పాలి. 'క' మూవీ తర్వాత కిరణ్ అబ్బవరం ఇమేజ్ కూడా పెరిగింది. అంతకుముందు వరుస ఫెయిల్యూర్స్ తో వచ్చిన డ్యామేజ్ మొత్తాన్ని ఈ చిత్రం క్లియర్ చేసేసింది. ఆయన కంప్లీట్ చేసిన దిల్ రుబా అనే మూవీ రిలీజ్ కి సిద్ధంగా ఉంది. వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకి రావొచ్చని అనుకుంటున్నారు. ఇదిలా ఉంటే తాజాగా కిరణ్ అబ్బవరం కొత్త సినిమాకి సంబందించిన కీలక ప్రకటన వచ్చింది. వర్కింగ్ టైటిల్ తో మొదలైన ఈ సినిమా ప్రీప్రొడక్షన్ వర్క్ లో ఉందంట. త్వరలో ఈ సినిమాకి సంబందించిన అఫీషియల్ ప్రకటన రానున్నట్లు తెలుస్తోంది. ఈ మూవీ కోసం కిరణ్ అబ్బవరం తన లుక్ మార్చేశాడు. కంప్లీట్ గా స్టైలిష్ అవతార్ లో కనిపిస్తున్నాడు. ఆ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ట్రిమ్ హెయిర్ కట్ తో కళ్లద్దాలు పెట్టుకున్న కిరణ్ అబ్బవరం లుక్ కొత్తగా ఉందనే మాట వినిపిస్తోంది. 'క' తో గేర్ మార్చిన కిరణ్ ఇకపై విభిన్న కథలతోనే మూవీస్ చేస్తానని తెలిపాడు. ప్రేక్షకులకి కావాల్సింది ఇవ్వడానికి కొత్త కొత్త స్టోరీస్ తో ముందుకొస్తానని అన్నారు. త్వరలో ఎనౌన్స్ కాబోయే ఈ '%ఖాూ% 10' మూవీ ఎలాంటి కథతో కిరణ్ అబ్బవరం చేయనున్నాడా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. స్టైలిష్ లుక్ లో కనిపిస్తున్నాడంటే కచ్చితంగా ఈ ట్రెండ్ కి కనెక్ట్ అయ్యే యూత్ ఫుల్ ఎంటర్టైనర్ ని ట్రై చేయబోతున్నాడనే మాట వినిపిస్తోంది. ఏది ఏమైనా ఆడియన్స్ మాత్రం ప్రస్తుతం కొత్తదనం ఉన్న కథలపైన ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు.

# వేడుకగా కీర్తి సురేశ్ వివాహం...



సినీ నటి కీర్తి సురేశ్ వివాహ బంధంలోకి అడుగు పెట్టింది. తన చిరకాల స్నేహితుడు, ప్రియుడు ఆంటోనీని పెళ్లాడింది. గోవాలోని ఓ ప్రముఖ రిసార్ట్ లో వీరి వివాహం వేడుకగా జరిగింది. ఇరు కుటుంబాలకు చెందిన పెద్దలు, అత్యంత సన్నిహితులు ఈ వివాహానికి హాజరయ్యారు. పెళ్లికి సంబంధించిన ఫొటోలను కీర్తి సురేశ్ సోషల్ మీడియా ద్వారా పంచుకుంది. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కొత్త జంటకు సినీ ప్రముఖులు, అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. 15 ఏళ్లుగా కీర్తి సురేశ్, ఆంటోనీ స్నేహితులు. వీరి స్నేహం ప్రేమగా మారింది. దీపావళి సందర్భంగా తమ ప్రేమ గురించి కీర్తి వెల్లడించింది. ఆంటోనీతో కలిసి దిగిన ఫొటోనే షేర్ చేసింది. తమ స్నేహబంధం ఇకపై జీవితాంతం కొనసాగనుందని ఆమె తెలిపింది. ఆంటోనీ విషయానికి వస్తే... ఆయనది వ్యాపార కుటుంబం. చెన్నై, కొచ్చిలో వారికి వ్యాపారాలు ఉన్నాయి. స్కూల్ డేస్ నుంచి కీర్తితో ఆయనకు స్నేహం ఉంది. కాలేజ్ రోజుల్లో వారి స్నేహం ప్రేమగా మారింది.

# అమ్మతో హ్యాపీగా.. ట్రెండింగ్‌లో బన్నీ స్పెషల్ ఫొటో..!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఈ నెల 5న 'పుష్ప-2: ది రూల్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టారు. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల పరంగా దూసుకుపోతోంది. విడుదలైన ఆరు రోజుల్లోనే రూ. వెయ్యి కోట్ల మార్క్‌ను అందుకుని, అత్యంత వేగంగా ఈ మైలురాయిని చేరిన తొలి భారతీయ సినిమాగా నిలిచింది. దీంతో ముమ్ముందు మరిన్ని రికార్డులు బద్దలు కావడం ఖాయమని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇదిలాఉంటే... తాజాగా బన్నీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా పోస్ట్ చేసిన ఫొటో ఒకటి ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా ట్రెండ్ అవుతోంది. ఈ ఫొటోలో అల్లు అర్జున్ తన తల్లి నిర్మలతో చిరునవ్వులు చిందిస్తూ కనిపించారు. అద్భుతమైన విజయాన్ని అందుకున్న కుమారుడిని చూసి నిర్మల గర్వంగా ఫీలవుతూ సంతోషంలో కనిపించగా... బన్నీ తన తల్లిని చూసి ఆనందంలో మునిగిపోయినట్లు ఆ ఫొటో ఉంది. "బ్యూటిఫుల్ మార్నింగ్. బిగ్ డే... బ్యూటిఫుల్ స్టార్ట్" అనే లైన్స్‌తో ఐకాన్ స్టార్ ఈ ఫొటోను అభిమానులతో పంచుకున్నారు. ఇప్పుడీ ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దీనిపై బన్నీ ఫ్యాన్స్ తమదైనశైలిలో స్పందిస్తున్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613